సాక్షి
జనగామ
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ఓవరాల్ చాంపియన్ వరంగల్

హనుమకొండలోని జేఎన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో.. అండర్ -15 ఓవరాల్ చాంపియన్‌గా వరంగల్ నిలిచింది. - 8లో▸



అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకుని 12 తులాల బంగారం, 53 తులాల వెండి, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నామని మానుకోట అడిషనల్ ఎస్పీ చెన్నయ్య తెలిపారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35⁰ /21⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత కొంత మేర తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'గృహజ్యోతి' వివరాల ధ్రువీకరణ ముమ్మరం

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకానికి సంబంధించి ధ్రువీకరణ ముమ్మరంగా సాగుతోందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుదారు ఇంటికి సిబ్బంది వస్తున్నారని, ప్రజాపాలనలో ఇచ్చిన రశీదు, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆ సమయంలో అందుబాటులో లేని కుటుంబాలు దగ్గరలో ఉన్న విద్యుత్ సహాయ ఇంజనీరింగ్ లేదా సహాయ గణాంకాధికారి కార్యాలయంలో వివరాలను అందించి ధ్రువీకరించుకోవాలని సూచించారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 60 మంది గైర్హాజరు



జనగామ రూరల్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం జిల్లా వ్యాప్తంగా 60 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ బైరీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం పరీక్షకు 526 మందికి 498, మధ్యాహ్నం పరీక్షకు 441 మందికి 409 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

విశ్వకర్మలకు సంపూర్ణ సహకారం



జనగామ: విశ్వకర్మలకు తమ శాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఏఈ శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జగదీష్



భూక్య కీర్తన

నర్మెట/తరిగొప్పుల: నర్మెట మండలం హన్మంతాపూర్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.జగదీష్, తరిగొప్పుల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న భూక్య కీర్తన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ఎ.శ్రీదేవి, ప్రత్యేక అధికారి గోవిందు రజిత గురువారం వేర్వేరుగా తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 10న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పఠనా నైపుణ్యం పెంచాలి

జనగామ రూరల్: విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం పెంచాలి.. ఇందుకు పాఠశాల గ్రంథాలయాల్లోని పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయని డీఈఓ రాము అన్నారు. గురువారం పట్టణంలోని బుక్ గోదాం నుంచి నేషనల్ బుక్ ట్రస్టు, ప్రభుత్వ టెక్స్‌బుక్స్ వారి నుంచి వచ్చిన పుస్తకాల కిట్లను హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహానుబావుల జీవిత విశేషాలు తెలుసుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని చెప్పారు. ప్రతీ పాఠశాలలో ఒక పీరియడ్ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 171 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు 261 లైబ్రరీ పుస్తకాలు, కథలు, తెలుగు, హిందీ, ఆంగ్ల భాష సంబంధిత పుస్తకాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, అనిల్, వెంకటేశ్వర్లు, నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ జాతరలు ముస్తాబు

ఐదు మండలాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర

- భక్తుల కోసం సదుపాయాల కల్పన
- దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు

జనగామ: ములుగు జిల్లాలో ఈనెల 21, 22, 23, 24 తేదీల్లో నిర్వహించే మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో జిల్లాలో మినీ జాతరలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఇప్పటి నుంచే అంతటా పండుగ వాతావరణం నెలకొంది. దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గద్దెల ప్రాంగణాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జాతర పరిసరాలను చదునుచేసి భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లి, నర్మెట మండలం అమ్మాపూర్, తరిగొప్పుల మండలం బొత్తలపర్రె(బొంతగట్టు నాగారం) శివారు ఏడు పోషమ్మలు, చిల్పూరు మండల కేంద్రంతోపాటు లింగంపల్లి, గండిరామవరం శివారు ఫత్తేపూర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఇప్పగూడెం, చింతగట్టు గ్రామాల్లో మూడు రోజుల పాటు మినీ జాతర వేడుకలు వైభవంగా జరగనున్నాయి.

పెరుగుతున్న ప్రాధాన్యం..

మేడారం మహాజాతరకు భక్తుల సంఖ్య ప్రతీ జాతరకు పెరుగుతూ వస్తోంది. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే వనదేవతల జాతరకు జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు నెల రోజుల ముందు నుంచే వెళ్లి ముందస్తు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దూర భారం, ట్రాఫిక్ తదితర సమస్యల కారణంగా లోకల్ జాతరలకు ప్రాధాన్యత పెరుగుతూ వస్తోంది. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో నిర్వహిస్తున్న మినీ జాతరల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మేడారం మహాజాతరకు ఆర్టీసీ జనగామ డిపో నుంచి 300 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపిస్తున్న యాజమాన్యం.. మినీ జాతరలకు సైతం ప్రత్యేక సర్వీసులు నడిపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

తాటికొండలో జాతర ప్రాంగణంలో ఉన్న అమ్మవారి గద్దె



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం-రంగరాయిగూడెం, కోమటిగూడెం-అక్కపల్లిగూడెం గ్రామాల పరిధిలో శ్రీ చింతగట్టు సమ్మక్క సారలమ్మ జాతర 2004 నుంచి ప్రతి రెండేళ్లకోసారి నిర్వహిస్తున్నారు. ఈసారి లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసి దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. తాటికొండ-జిటేగూడం జీపీల పరిధిలో 2007 నుంచి మినీ జాతర నిర్వహిస్తున్నారు. ప్రస్తుత జాతర కమిటీ చైర్మన్ కోరుకొప్పుల మహేందర్, వైస్ ఎంపీపీ చల్ల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రతీ జాతరకు వస్తాం..



తాటికొండలో జరిగే మినీ మేడారం జాతరకు ప్రతీ రెండేళ్ల కోసారి కుటుంబంతో కలిసి వస్తాం. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటాం. తల్లుల దీవెనలతో అనుకున్న పనులు జరుగుతున్నాయి.

- అక్కెనపల్లి వెంకటయ్య, భక్తుడు, తాటికొండ

ఊరంతా కలిసి..



మన్‌సాన్‌పల్లిలో జాతర(ఫైల్)

బచ్చన్నపేట : మన్‌సాన్‌పల్లి అటవీ ప్రాంతంలో రెండేళ్ల కోసారి సమ్మక -సారలమ్మ జాతర నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలంతా కలిసి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసుకుని జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. ఈసారి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో తగినట్టుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ప్రభుత్వం వసతులు కల్పించాలి



గ్రామంలో నిర్వహిస్తున్న జాతర నేపథ్యంలో ప్రభుత్వం నిధులను మంజూరు చేసి భక్తులకు అవసరమైన వసతులు కల్పించాలి. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరలో అమ్మవార్లను దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

- గీస సందీప్, మన్‌సాన్‌పల్లి, బచ్చన్నపేట

2018 సంవత్సరం నుంచి..

నర్మెట: అమ్మాపూర్‌లో మేడారం మినీ జాతర 2018 సంవత్సరం ప్రారంభమైంది. నర్మెటతో పాటుగా తరిగొప్పుల, బచ్చన్నపేట, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. గ్రామస్తులు విరాళాలను సేకరించి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.



అమ్మాపూర్‌లో జాతర(ఫైల్)

నాలుగు గ్రామాల్లో..



లింగంపల్లిలోని జాతర ముఖద్వారం

చిల్పూరు: మండల పరిధి నాలుగు గ్రామాల్లో మినీ జాతరలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లింగంపల్లిలో 1992 నుంచి ప్రారంభమైన మినీ జాతర.. మేడారం తరువాత జిల్లాలో పెద్ద జాతరగా పేరుగాంచింది. ఈ జాతర నిర్వహణ 2016లో దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. శ్రీపతిపల్లి-కొండాపూర్ గ్రామాల సరిహద్దుల్లో మినీ జాతర 2002 సంవత్సరంలో ప్రారంభమైంది. చిల్పూరుగుట్ట-మల్కాపూర్గుట్ట సమీపాన 2022 సంవత్సరం, ఫత్తేపూర్-గార్లగడ్డతండా జీపీల పరిధిలో 2010 సంవత్సరం మినీ జాతరలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక జాతర కమిటీలు ఏర్పాటు చేసుకుని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

20 నుంచి జాతర మొదలు



ఈ నెల 20వ తేదీ నుంచి మినీ మేడారం జాతర ప్రారంభవుతుంది. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

- లింగస్వామి, చిల్పూరు, జాతర కోయపూజారి

2006 సంవత్సరం నుంచి..



బొంతగట్టునాగారం-బొత్తలపర్రె వద్ద మినీ జాతర ఏర్పాట్లు

తరిగొప్పుల: బొంతగట్టు నాగారం, బొత్తలపర్రె శివారు ఏడు పోచమ్మల వద్ద 2006 సంవత్సరం నుంచి మినీ మేడారం జాతర నిర్వహిస్తున్నారు. జాతర సమయంలో టెండర్లు నిర్వహించగా వచ్చిన ఆదాయంతో ఏర్పాట్లు, సదుపాయాలు కల్పిస్తున్నారు. గత జాతర సమయంలో రూ.7లక్షల ప్రభుత్వ నిధులతో తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, విశ్రాంతి గది నిర్మించారు. తాగునీటి కోసం బోర్లు వేయించి మోటార్లు బిగించారు. ఈఏడాది రూ.8లక్షల మండల పరిషత్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కాగా వేలం ద్వారా రూ.3 లక్షల నిధులు సమకూరాయి.

ప్రభుత్వం సహకరిస్తే మరింత అభివృద్ధి



మినీ మేడారం జాతర వేడుకలకు ప్రభుత్వం సహకరిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో భక్తులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈసారి ప్రభుత్వం బెల్ట్ షాపుల నిర్వహణపై ఆంక్షలు విధించగా.. పెద్దతీర్థం దక్కించుకున్న వారు కమిటీకి డబ్బులు చెల్లించలేమని చెబుతున్నారు. జాతర ముగిసే వరకు వేలం దక్కించుకున్న వారికి వెసులుబాటు ఇవ్వాలి.

- కుర్రె మల్లయ్య, బొంతగట్టునాగారం, తరిగొప్పుల

7,48,570 @ ఓటర్లు

- తుది ఓటరు జాబితా ప్రకటించిన కలెక్టర్

జనగామ: రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం తుది ఓటరు జాబితాను వెలువరించగా.. కలెక్టర్ శివలింగయ్య ధ్రువీకరించారు. జిల్లాలో 7,48,570 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 3,78,688 మంది మహిళలు, 3,69,859 మంది పురుషులు, 23 మంది ట్రాన్స్ జెండర్లున్నారు. రెండు నెలలుగా ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, డూప్లికేట్, డబ్లింగ్ ఓట్లను తొలగించడంతోపాటు ఓటర్లు తమ వివరాలు అప్డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటరు జాబితా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ పేర్లను జాబితాలో చూసుకోవచ్చని సూచించారు.

నాణ్యమైన పాలు సేకరించాలి

- మిల్క్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్



అధికారి రమేష్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు

బచ్చన్నపేట: పాడి రైతుల నుంచి నాణ్యమైన పాలు సేకరించి డెయిరీని లాభాల బాటలో నడిపించాలని మిల్క్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్ అన్నారు. గురువారం స్థానిక విజయ పాల డెయిరీ కేంద్రం ఆవరణలో బీఎంసీయూ అధ్యక్షుడు పుర్మ జోగిరెడ్డి అధ్యక్షతన పాల సేకరణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాణ్యమైన పాలు పితకాలంటే ముందుగా పాడి పశువులకు ఎలాంటి జబ్బులు లేకుండా చూడాలని చెప్పారు. అలాగే ముందుగా వచ్చే పాలను దూడలకు వదులుతూ.. అవసరమైతే వాటిని రైతులు తమ ఇంటి అవసరాలకు వినియోగించాలన్నారు. అనంతరం అధికారులను సన్మానించారు. డైరెక్టర్లు సత్తయ్య, రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, శ్రీహరి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ సోమేశ్వరాలయంలో మాస కల్యాణం



మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం చండీకాసమేత శ్రీ సోమేశ్వర స్వామి వారికి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య జరిగిన ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి తరించారు. ఆలయ ఈఓ లక్ష్మీ ప్రసన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వివరాల సేకరణ పకడ్బందీగా ఉండాలి

కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



కళ్లెంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమం, ప్రజాపాలన దరఖాస్తుల వివరాల సేకరణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. గురువారం పెంబర్తి గ్రామం, జనగామ పట్టణంలోని మూడో వార్డు, కళ్లెం గ్రామంలో ఆయా కార్యక్రమాలను అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం, రూ.500లకే గ్యాస్ కోసం తప్పుగా నమోదు చేసిన వారి వివరాలను ఇంటింటికీ వెళ్లి గ్యాస్ డెలివరీ రిసిప్ట్, ఖాతా నంబర్ పూర్తి వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో మండల స్థాయి ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల విస్తరణ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. ఆర్డీఓ మురళీకృష్ణ, డీసీఎస్ఓ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కళ్లెం గ్రామంలో..

లింగాలఘణపురం: కళ్లెం గ్రామాన్ని కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ సందర్శించారు. మహాలక్ష్మి పథకం దరఖాస్తుల్లో తప్పుగా నమోదు చేసిన వారి వివరాలను తిరిగి సేకరించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటినుంచి చెకుముకి పోటీలు

- జిల్లాలో మొదటిసారి రాష్ట్ర స్థాయి పోటీలు
- మూడు రోజుల పాటు నిర్వహణ
- 33 జిల్లాల నుంచి రానున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాము

జనగామ రూరల్: జిల్లాలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో శుక్రవారం (నేడు) నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలకు సంబంధించి ఏర్పాట్లపై గురువారం జేవీవీ జిల్లా అధ్యక్షుడు మర్రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ కె.రాము సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రం వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. వారికి వసతి సదుపాయాల కల్పనకు సంబంధించి నిర్వాహకులు సిద్ధం చేశారని, విద్యాశాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ.. 9వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభ సమావేశం ఉంటుందని, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ఎస్‌ఐఎస్ మాజీ డైరెక్టర్ శశికిరణ్, కలెక్టర్ శివలింగయ్య, నిట్ ప్రొఫెసర్ రాంచంద్రయ్య, లక్ష్మారెడ్డి, ఆదినారాయణ, బీఎస్.రెడ్డి, కోయ వెంకటేశ్వర్లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.


13 నుంచి 'సదరం' క్యాంపు

జనగామ రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి నిర్వహించే సదరం క్యాంపునకు అర్హులైన దివ్యాంగులు మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ మొగిలప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని, మీసేవలో దరఖాస్తుకు రూ.35 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. అలాగే 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని, మీసేవలో స్లాట్ బుకింగ్ కాదన్నారు. అలాంటి వారు నేరుగా క్యాంపులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, ఫొటో, మీసేవా రశీదు తీసుకురావాలని సూచించారు. మొత్తం 230 మందికి క్యాంపు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

తేది	వైకల్యం	కొత్తవి	రెన్యూవల్	మొత్తం
13	శారీరక	30	20	50
15	శారీరక	30	20	50
16	మానసిక(ఎంఐ)	15	05	20
16	మానసిక(ఎంఆర్)	15	15	30
17	వినికిడి లోపం	35	15	50
20	దృష్టిలోపం	25	05	30

మేడారంలో వీటిని చూడాల్సిందే..

- గద్దెలతోపాటు తల్లుల పూజా మందిరాలు కూడా ప్రత్యేకమే..
- జంపన్న, నాగులమ్మ గద్దెలకు ప్రచారం కరువు
- భక్తులకు తెలిసేలా సమాచార వ్యవస్థ ఏర్పాటు అవసరం



ఎస్ఎస్ తాడ్వాయి: మదినిండా భక్తి భావనలు.. సంప్రదాయ పూజలు.. మహిమ గల తల్లులు.. ప్రకృతి సోయగంలా ప్రవహించే భక్తజన ప్రవాహం.. ఇలా మేడారం జాతర ప్రత్యేకతలు ఎన్నెన్నో ఉన్నాయి. కోరిన కోర్కెలు నెరవేర్చే తల్లులను దర్శించుకునేందుకు రెండేళ్లకోసారి భక్త కోటి తరలివస్తుంటుంది. దేశంలో అతిపెద్ద గిరిజన జాతరగా వర్ధిల్లుతున్న సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారు. సాధారణంగా భక్తులు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను ప్రత్యేకంగా దర్శించుకుంటారు. కానీ మేడారంలో సమ్మక్క పూజామందిరం, కన్నెపల్లిలో సారలమ్మ పూజా మందిరం.. ఇలా చూడదగ్గ ప్రదేశాలు ఉన్నప్పటికీ చాలామంది భక్తులకు తెలియదు. వాటిని సందర్శించేలా అధికారులు ప్రచారం నిర్వహించాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మేడారంలో సమ్మక్క గుడి..

మేడారంలో సమ్మక్క పూజామందిరం ఉంది. గద్దెల నుంచి ఈ పూజా మందిరం 200 మీటర్ల దూరంలోనే ఉంటుంది. జాతర సమయంలో గుడిమెలిగె పండుగతో మొదలుకొని మండమెలిగె పూజా కార్యక్రమాలన్నీ ఈ మందిరంలోనే నిర్వహిస్తారు. జాతరకు వచ్చే చాలామంది భక్తులకు ఇక్కడ సమ్మక్క గుడి ఉందనే విషయం తెలియకపోవడంతో గద్దెలను మాత్రమే దర్శించుకుని వెళ్తున్నారు.

మూడు కిలోమీటర్ల దూరంలో కన్నెపల్లి

సమ్మక్క కూతురు సారలమ్మ గుడి కన్నెపల్లి గ్రామంలో ఉంది. ఇది మేడారం అమ్మవార్ల గద్దెల నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పూజారులు, గ్రామస్తులు సారలమ్మను ఇంటి ఆడబిడ్డగా భావిస్తారు. జాతర సమయంలో గుడినుంచి అమ్మవారిని మేడారం గద్దెపైకి తీసుకెళ్లే క్రమంలో సంతానం కోసం మహిళలు తడి బట్టలతో వరం పడతారు. వారి పైనుంచి అమ్మవారు దాటుకుంటూ వెళ్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల్లో విశ్వాసం. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన భక్తులు మాత్రమే సారలమ్మ గుడికి వచ్చి పూజలు చేస్తారు. ఈ గుడి ఉందనే విషయం కూడా తొలిసారి జాతరకు వచ్చే భక్తులకు తెలియకుండా పోతున్నది.



మేడారంలోని సమ్మక్క పూజా మందిరం



కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరం



జంపన్నవాగు ఒడ్డున జంపన్న గద్దె



జంపన్నవాగు ఒడ్డున నాగులమ్మ గద్దె

జంపన్నవాగు గద్దె..

జంపన్నవాగు ఆవతలి పక్క స్నానఘట్టాలపై జంపన్న గద్దె ఉంది. ఈ విషయం చాలామందికి తెలియదు. తెలిసిన వారు మాత్రమే పూజలు చేస్తారు. సమ్మక్క కొడుకు అయిన జంపన్న గద్దె వద్ద అందరికీ తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

నాగులమ్మ..

జంపన్నవాగు ఇవతలి భాగం స్నాన ఘట్టాల వద్ద నాగులమ్మ గద్దె ఉంది. జంపన్నవాగులో స్నానాలు ఆచరించిన భక్తులు నాగులమ్మకు కూడా పూజలు చేస్తుంటారు. మేడారం జాతరకు వచ్చే భక్తుల్లో చాలామంది మహిళలు ఈ గద్దెను ఎంతో పవిత్రంగా భావించి పూజలు చేస్తారు. జాతరకు వచ్చే భక్తులు అటుగా వెళ్తున్నా ఇది నాగులమ్మ గద్దె అని చాలామందికి అసలే తెలియదు.

సమాచార లోపంతోనే..

మేడారం జాతరలో అమ్మవార్ల పూజా మందిరాలు, జంపన్న, నాగులమ్మ గద్దెలు ఉన్నాయని దేవాదాయశాఖ తరఫున భక్తులకు తెలిపేలా సమాచార వ్యవస్థ లేదు. దీంతో చాలా మంది భక్తులు అసలు వాటిని దర్శించుకోలేక పోతున్నారు. జాతరకు వచ్చే ప్రతి భక్తుడు జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన తరువాతే అమ్మవార్ల దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. కనీసం ఈ గద్దెల పేర్లపై ఎలాంటి సూచిక బోర్డులు ఉండవు. దేవాదాయ శాఖ తరఫున ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో జాతరకు వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్టాండ్, ప్రైవేట్ వెహికల్స్ పార్కింగ్, ప్రయాణ మార్గాల్లో జాతర పరిసర ప్రాంతాల్లో చూడదగిన ప్రదేశాల గురించి స్పష్టమైన సమాచారం తెలిసేలా వ్యవస్థ రూపొందించాలని భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

వేర్వేరు కారణాలతో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



భానుప్రసాద్ (ఫైల్)

రఘునాథపల్లి: ట్రాక్టర్‌పైనుంచి పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని కుర్చపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులిగిల్ల దర్శనం, మౌనిక దంపతులకు కూతురు, కుమారుడు భానుప్రసాద్ (8) ఉన్నారు. 3వ తరగతి చదువుతున్న భానుప్రసాద్‌కు జ్వరం రావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. వ్యవసాయ పనులకు వెళ్తున్న క్రమంలో తల్లిదండ్రులు తమ కుమారుడిని వెంట తీసుకెళ్లారు. అక్కడ పొగాకు బేళ్లను ట్రాలీలో వేసుకుని కుమారుడిని బేళ్లపై కూర్చొబెట్టి తండ్రి ట్రాక్టర్ నడుపుతున్నాడు. దారి సరిగా లేక ట్రాలీ ఊగడంతో భానుప్రసాద్ కిందపడ్డాడు. వెంటనే వెనుక టైర్‌పై భానుప్రసాద్‌పై నుంచి వెళ్లింది. తండ్రి గుర్తించి లబోదిబోమంటూ తీవ్రగాయాలైన కుమారుడిని వరంగల్ ఎంజీఎం తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, బాలుడి మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాల్వలో పడి వృద్ధురాలు..

కేసముద్రం : కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన గురువారం సాయంత్రం ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పానుగోటి లక్ష్మి(85) స్థానిక గ్రామ పంచాయతీ పక్కన గల చెరువుకు వెళ్లే కాల్వలో కాలుజారి పడింది. దీంతో ఊపిరాడక మృతి చెందింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు..



స్వామి మృతదేహం

కొత్తగూడ : కాళ్లకు వల చిక్కుకుని ఓ వ్యక్తి పాకాల సరస్సులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పొగుళ్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈరబోయిన స్వామి(58) పాకాల సరస్సులో చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యథావిధిగా చేపలవేటకు వెళ్లగా తెప్ప పై నుంచి నీటిలో పడ్డాడు. ఈతకొట్టడానికి యత్నిస్తుండగా కాళ్లకు చేపల వల చుట్టుకుని మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి మత్స్యకారులు స్వామి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

లేఖలకే..‘సై’

వరంగల్ కమిషనరేట్‌కు పలు కొత్త ముఖాలు | పోలీస్‌శాఖలో పేయింగ్ పోస్టింగ్‌ల చర్చ..

- పట్టు బిగించిన ఎమ్మెల్యేలు.. పారని మంత్రి మంత్రం
- భారీగా ధర పలికిన పలు ‘స్టేషన్లు’
- ఎవరి సామాజిక వర్గానికి వారు పెద్దపీట

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి వెలువడిన ఇన్‌స్పెక్టర్ల బదిలీలతో పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులకు ఓ స్పష్టత వచ్చింది. ప్రతిభకు ప్రాధాన్యత..? పైరవీలకా..? అనే అంశంపై ఉన్న సందేహాలకు నివృత్తి లభించింది. గత ప్రభుత్వం అనుసరించిన లేఖల సంస్కృతికే ఈ ప్రభుత్వమూ సై అంది. కానీ, పోలీస్‌శాఖలో గతంనుంచి ప్రచారంలో ఉన్న మంత్రుల పెత్తనానికి స్థానం లేకుండా పోయింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పేర్లను మంత్రులు ప్రతిపాదిస్తేనే పోస్టింగ్‌లు ఉంటాయనే విషయంపై చాలా ప్రచారం సాగింది. కానీ జరిగిన బదిలీల్లో ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వ్యక్తులకే పోస్టింగ్‌లు లభించినట్లు చర్చించుకుంటున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు పార్లమెంట్ ఎన్నికల వరకు పోస్టింగ్‌లు మార్చేది లేదని బయట చెప్పినప్పటికి వారి అనుయాయులు తీసుకువచ్చిన వ్యక్తులకే పెద్దపీట వేసినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఇక్కడే కొలువులు చేస్తామని ఆశించిన వారు.. కనీసం కమిషనరేట్‌లో ఉండకుండా బయటకు వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు... తమను మభ్యపెట్టిన నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారు తమను నమ్మించి గొంతు కోశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట అక్కడ పోటీచేసి ఇన్‌చార్జ్‌లుగా ఉన్న నేతల లేఖలకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చినట్లు పోస్టింగ్‌లను బట్టి స్పష్టమవుతోంది.



పేయింగ్ పోస్టింగ్‌లపై చర్చ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో ఇప్పటివరకు సంబంధం లేని చాలామంది అధికారులు ఈ బదిలీల్లో కీలకమైన పోస్టింగ్‌లు సాధించారు. చాలాకాలంగా కమిషనరేట్‌లో పనిచేస్తున్న పలువురు కొత్తవారికి పోస్టింగ్‌లు ఎలా సాధ్యమయ్యాయనే విషయంపై జుట్టు పీక్కుంటున్నారు. ఈ నెల 7న జరిగిన బదిలీల్లో కొంతమందికి ప్రతిభతో పోస్టింగ్‌లు లభించగా, చాలామందివి పేయింగ్ పోస్టింగ్‌లు అంటూ ప్రచారం సాగుతోంది. ఏకంగా ఓ పోలీస్‌స్టేషన్ పోస్టింగ్ రూ.30లక్షలు పలికిందని, మరో స్టేషన్ రూ.25లక్షలకు సెట్ అయ్యిందనే ప్రచారం కమిషనరేట్‌లో జోరుగా సాగుతోంది.

వారివారి సామాజిక వర్గాలకు పెద్దపీట

‘కులం, మతం, వర్గ బేధాలు చూడం’ అని ప్రమాణం చేసిన నియోజకవర్గ ముఖ్య నేతలు ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో అనుసరించిన ఏకైక నిబంధన తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై కమిషనరేట్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోస్టింగ్‌లలో పైరవీలకు పెద్దపీట వేస్తే ప్రతిభ ఉన్న అధికారులంతా లూప్‌లైన్ పోస్టింగ్‌లలో మగ్గిపోవాల్సిందే అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వివిధ కారణాలతో సస్పెండ్ అయిన అధికారులు, ఇంతకాలం ఇక్కడే పనిచేసి తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు సహితం పోస్టింగ్‌లు దక్కడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధుల మాటలకు, చేతలకు సంబంధం ఉండదనే విషయం మరోసారి రుజువైందని బాహాటంగానే అంటున్నారు.

చాలామంది ఎమ్మెల్యేలు మాత్రం ప్రస్తుతం వచ్చిన అధికారులు ‘మేం కష్టకాలంలో ఉన్నప్పుడు మాకు అండగా ఉన్నారు.. అందుకే వారికి పోస్టింగ్‌లు ఇచ్చా’మని చెబుతున్నారు. కానీ వారు గతంలో పనిచేసిన ప్రాంతాలకు, ప్రస్తుత నియోజకవర్గాలకు ఎక్కడా సరిపోకపోవడంతో పేయింగ్ పోస్టింగ్‌ల వాదం బలంగా వినిపిస్తోంది. ఒకరిద్దరు నేతలు నేరుగా డబ్బులు తీసుకోగా, కొంతమంది నేతల కుమారులు డబ్బులు తీసుకున్నట్లు సమాచారం.

పారని మంత్రి మంత్రం..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చాలా పోలీస్‌స్టేషన్‌లకు తాను ప్రతిపాదించిన అధికారులకే పోస్టింగ్‌లు వస్తాయని ముందునుంచి చెప్పుకువస్తున్న ఓ మంత్రి మంత్రం పోస్టింగుల్లో ఎక్కడా పారలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోస్టింగ్‌ల సిఫార్సులు తయారు చేస్తున్న క్రమంలో సదరు మంత్రికి, ఎమ్మెల్యేలకు మాటమాట పెరిగినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యేలు తమ పరిధిలోని ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు మమ్ముల్ని అన్ని రకాలుగా సంప్రదించిన అధికారుల పేర్లను వారి లేఖల ద్వారా వరంగల్ పోలీస్ కమిషనర్, మల్టీజోన్ 1 ఐజీకి పంపినట్లు తెలిసింది. కానీ మంత్రి మాట ఎక్కడ కూడా పనిచేయకపోవడంతో వారిని నమ్ముకున్న వారు నట్టేటా మునిగినట్లు చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో గెలిచిన తరువాత మొదటిసారిగా జరిగిన బదిలీల్లో ఎమ్మెల్యేల మాట పై చేయిగా నిలిచింది.

అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత

- 12 తులాల బంగారం, 53 తులాల వెండి, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ చెన్నయ్య



నిందితుల అరెస్టు, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలను చూపుతున్న అడిషనల్ ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకుని వారినుంచి 12 తులాల బంగారం, 53 తులాల వెండి, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ అదనపు సీఐ బి.రమేష్, టౌన్ ఎస్సై టి.రామారావు సిబ్బందితో కలిసి మహబూబాబాద్ పట్టణంలోని వివేకానంద సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యానంబైలు ప్రాంతానికి చెందిన పాన్నాల శివశంకర్, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన ఎడ్ల సుమన్.. పల్సర్ బైక్‌పై వస్తుండగా వారిని ఆపారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు అడగగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చి విచారించగా పలు చోట్ల చోరీలకు పాల్పడుతున్నామని ఒప్పుకున్నారు. పాన్నాల శివశంకర్, ఎడ్ల సుమన్.. కన్నా రేణుక, దాసరి జంపయ్యతో కలిసి కొద్ది రోజుల నుంచి కొత్తగూడెం, మహబూబాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలు చేశారు. అలాగే, మరో నలుగురితో కలిసి ఖమ్మం, హైదరాబాద్, ఏపీలోని నెల్లూరు జిల్లాలో చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో చోరీ చేసిన బంగారం, వెండి, ఇతర వస్తువులను వరంగల్‌లో విక్రయించడానికి వెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకుని రూ.5.60 లక్షల విలువైన 12 తులాల బంగారం, 53 తులాల వెండి, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కన్నా రేణుక, దాసరి జంపయ్య పరారీలో ఉన్నారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. కాగా, ఈ కేసుల్లో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న మహబూబాబాద్ అదనపు సీఐ రమేష్, టౌన్ ఎస్సైలు రామారావు, పవన్ కుమార్, సిబ్బంది సుధీర్, రుద్రయ్య, రాజు, దేవేందర్, సహకరించిన సీసీఎస్ సీఐ చంద్రమౌళి, రూరల్ ఏఎస్సై రహమత్ అలీ, కేసముద్రం ఎస్సై వంశీధర్, పీసీలు సత్యనారాయణ, రాజు, వీరన్న తదితరులను అభినందించారు. ట్రైనీ ఐపీఎస్ చేతన్ నితిన్, డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళ బ్రాస్‌లెట్ చోరీ

జనగామ: జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ చేతికి ఉన్న బ్రాస్‌లెట్ చోరీకి గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన బీరెడ్డి పావని తన తల్లి నక్షత్రమ్మతో కలిసి జేబీఎస్‌లో తొర్రూరుకు వెళ్లే బస్సు ఎక్కి జనగామ బస్టాండ్‌లో దిగారు. ఇక్కడ నుంచి పల్లెవెలుగు బస్సులో హనుమకొండకు బయలుదేరగా పాతిమానగర్‌కు వెళ్లి చూసుకునేసరికి చేతికి బ్రాస్‌లెట్ లేకపోవడంతో ఆందోళనకు గురై తిరిగి జనగామకు వచ్చారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులకు తెలుపగా పోలీసుల వద్దకు వెళ్లాలని సూచించారు. ఆర్టీసీ చౌరస్తాలోని పోలీసు కంట్రోల్‌రూంలో బస్టాండ్‌లోని సీసీపుటేజీలను పరిశీలించారు. హనుమకొండ ప్లాట్‌ఫాం వద్ద బస్సుకోసం ఎదురు చూసే క్రమంలో మహిళ చేతికి బ్రాస్‌లెట్ ఉండగా ఎక్కే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కొట్టేసి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కాజీపేట డీజిల్ లోకోషెడ్‌కు జాతీయస్థాయి గుర్తింపు

జాతీయ స్థాయిలో ఉత్తమ షెడ్‌గా ఎంపిక

- లోకోల నిర్వహణలో ప్రథమస్థానం
- ఇతర షెడ్లకు ఆదర్శమని అభినందించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం

కాజీపేట రూరల్: భారతీయ రైల్వేలో కాజీపేట డీజిల్ లోకోషెడ్ ఉత్తమ షెడ్‌గా ఎంపికైనట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. లోకోల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు, సంవత్సరంలో తక్కువ వైఫల్యాలను కలిగి జాతీయస్థాయి గుర్తింపు పొందింది. కాజీపేట డీజిల్‌షెడ్ 1973 ఏప్రిల్ 21న ప్రారంభమైంది. 225 డీజిల్, ఎలక్ట్రిక్ లోకోలు, 720 సిబ్బందితో నిర్వహణ కొనసాగుతోంది. దేశంలోనే డీజిల్ షెడ్ లోకోల నిర్వహణలో ప్రథమ స్థానంలో ఉంది. రైలు నెట్‌వర్క్‌లో భాగంగా కాజీపేట డీజిల్ లోకోలతో నడిచే రైళ్ల సర్వీస్‌లను దశలవారీగా విద్యుత్ ట్రాక్షన్‌తో నడిపించేందుకు రైల్వే చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు డీజిల్ లోకోషెడ్ ఎలక్ట్రిక్ లోకోషెడ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలతో అబివృద్ధి చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వేకింద 5 డీజిల్ షెడ్‌లు 373 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లు నిర్వహిస్తున్నారు. కాజీపేట డీజిల్‌షెడ్ 113 డబ్ల్యూఏజీ.-7 ఎలక్ట్రిక్ లోకోలు ఉన్నాయి. కాజీపేట డీజిల్‌షెడ్ ఎలక్ట్రిక్‌లోకోల నిర్వహణలో ఉత్తమ పని తీరుకుగాను జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అదేవిధంగా కాజీపేట, గుత్తి డీజిల్ షెడ్‌లు నగదు పురస్కార్‌కు ఎంపికయ్యాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రత్యేక గుర్తింపు పొందిన కాజీపేటతో పాటు గుత్తి డీజిల్ లోకోషెడ్ల అధికారులను, రైల్వే కార్మిక సిబ్బందిని అభినందించారు. షెడ్‌లో సిబ్బంది అవలంబిస్తున్న అత్యుత్తమ పనితీరు, పద్ధతులను ప్రశంసించారు. లోకోషెడ్‌ల నుంచి అత్యుత్తమ ఉత్పత్తిని అందించడంలో ఇతర షెడ్లకు ఆదర్శంగా నిలిచారని జీఎం పేర్కొన్నారు.



డీజిల్ లోకోషెడల్లో ఇంజన్లు

వరంగల్ మార్కెట్‌కు మూడ్రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు వచ్చినందున రైతులు, వ్యాపారస్తులు, గుమస్తా, దడవాయి, కార్మికులు గమనించాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 9వతేదీ (శుక్రవారం) అమావాస్య, 10వ తేదీ(శనివారం) వారాంతపు యార్డ్ బంద్, 11వ తేదీ(ఆదివారం) వారంతపు సెలవు కావడంతో వరుసగా మూడ్రోజులు సెలవులు ఉన్నాయన్నారు. తిరిగి 12వ తేదీ సోమవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందన్నారు. బంద్ ఉన్న రోజుల్లో రైతులు సరుకులు తెచ్చి ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు.

ఓవరాల్ చాంపియన్ వరంగల్



రెండో రోజు పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



పోటీలో తలపడుతున్న బాలురు

- రన్నరప్ హైదరాబాద్
- ముగిసిన అండర్–15 రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు
- అంతర్జాతీయ రెజ్లర్ల స్ఫూర్తితో రాణించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



పోటీలో తలపడుతున్న బాలికలు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు గురువారం రాత్రి వరకు కొనసాగాయి. అండర్–15, 20 బాలబాలికల విభాగాల్లో జరుగుతున్న పోటీల్లో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 33, 36, 39,42, 46,50, 54,58, 62,66, కేజీల విభాగాలలో బాలురకు ఫ్రీస్టైల్, గ్రీక్ రోమన్ స్టైల్‌లో, బాలికలకు ఫ్రీస్టైల్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. చాంపియన్‌షిప్ కైవసం చేసుకునేందుకు క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. నువ్వా?..నేనా? అన్నట్లు సాగిన పోటీల్లో టెక్నిక్‌లు ప్రదర్శించి పతకాలు సాధించారు.

పతకాల వేటలో కుస్తీ మే సవాల్..

పతకాల వేటలో కుస్తీ మే సవాల్ అన్నట్లు సాగిన పోటీలో వరంగల్ జిల్లా క్రీడాకారులు టెక్నిక్‌లతో ప్రత్యర్థులను మట్టికరిపించారు. అండర్–15 విభాగంలో 87 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌కైవసం చేసుకున్నారు. 81 పాయింట్లతో హైదరాబాద్ క్రీడాకారులు రన్నరప్‌గా నిలిచి, 62 పాయింట్లతో సంగారెడ్డి తృతీయ స్థానంలో నిలిచి ట్రోఫీ అందుకుంది. అండర్–20 విభాగంలో నిర్వహించిన పోటీలు రాత్రి 10గంటల వరకు కొనసాగాయి.

అంతర్జాతీయ రెజ్లర్ల స్ఫూర్తితో రాణించాలి

రెండో రోజు కుస్తీ పోటీల ప్రారంభోత్సవానికి హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అండర్–20 విభాగంలో పోటీలు ప్రారంభించిన అనంతరం కాసేపు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న భారత రెజ్లర్ల స్ఫూర్తితో ఇతర రెజ్లర్లు రాణించాలని సూచించారు. అనంతరం అండర్–15లో గెలుపొందిన పలువురు క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీం, జిల్లా క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్, రెజ్లింగ్ సంఘం బాధ్యులు సుధాకర్, జైపాల్, సాయిలు, శ్రీనివాస్, రాజేందర్, సతీష్, రాజు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర విధానాలను వ్యతిరేకించాలి

వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఎఫ్‌టీయూ, ఏఐసీటీయూ నాయకులు గన్నారపు రమేష్, షేక్ బాషుమీయా, ముక్కెర రామస్వామి, సీహెచ్.రంగయ్య, ఐఎన్‌టీయూసీ పుల్ల రమేష్, గంగుల దయాకర్, నర్ర ప్రతాప్, ఎండీ.ఖాసీం అన్నారు. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలోని కార్పొరేట్ అనుకూల కేంద్ర బీజేపీ ప్రభుత్వం.. బరితెగించి ప్రజాకార్మిక వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. దేశంలో సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్న దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల16న జరగనున్న దేశవ్యాప్త కార్మిక గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, చెన్నకేశవులు, పాశం రవి, లింగమూర్తి, రాములు, రవి, మహబూబ్ పాషా, జన్ను ప్రకాష్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల ఆరోపణలపై త్రిసభ్య కమిటీ

- నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- రెండు వారాల్లో నివేదిక
- కేయూలో హాట్‌టాపిక్ మారిన అంశం
- అన్నీ వెలుగులోకి వస్తాయని భావిస్తున్న విద్యార్థులు



సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి విన్నవిస్తున్న విద్యార్థి నాయకులు (సీట్లు రాని అభ్యర్థులు కూడా)

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో కల్పించిన పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్ల వ్యవహారంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ఫిర్యాదులు వెళ్లగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా విచారణకు త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, సీపీ గేట్ కన్వీనర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి ధ్రువీకరించారు. కేయూలో కొంత కాలం క్రితం అన్ని విభాగాలు కలిపి సుమారు 200 సీట్లకు పైగానే నోటిఫికేషన్ ఇచ్చి ప్రవేశాలు కల్పించారు. ప్రధానంగా పార్ట్‌టైం పద్ధతిలో 25 శాతం సీట్లు, ఫుల్‌టైం అభ్యర్థులుగా 75 శాతం సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. ఎక్కువ శాతం సీట్లు పార్ట్‌టైం అభ్యర్థులకే ప్రవేశాలు కల్పించారనేది ప్రధాన ఆరోపణ. అదేవిధంగా పలు విభాగాల్లో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కూడా ఆరోపణలు వచ్చాయి. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థుల్లో వివిధ విభాగాల్లో సీట్లు లభించని అభ్యర్థులు వివిధ విద్యార్థి సంఘాల జాక్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల అక్రమాలపై విచారణ జరిపించాలని, తమపై దాడులు చేసిన పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని అప్పట్లోనే ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో నెలరోజులకు పైగా దీక్షలు కొనసాగించారు. అడ్మిషన్లలో నిబంధనలు పాటించలేదని, వీసీ, అప్పటి రిజిస్ట్రార్లు ఇష్టానుసారంగా వ్యవహరించారని, పలు విభాగాల డీన్లపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఇటీవల మరోమారు సీఎం రేవంత్ దృష్టికి..

అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఈ దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ఇటీవల మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నత విద్యాకమిషనర్ బుర్రా వెంకటేశం దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఆర్ట్స్, సోషల్ సైన్స్, సైన్స్, ఎడ్యుకేషన్, ఫార్మసీ, కామర్స్, ఇంజనీరింగ్, లాలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో అడ్మిషన్లు జరిగిన వ్యవహారంపై వచ్చిన ఆరోపణలను తేల్చేందుకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ రెండు వారాల్లో నివేదిక ఇవ్వనుంది. కమిటీ విచారణతో పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంలో జరిగిన అక్రమాలు, నియమనిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. విచారణ కమిటీ వేసిన విషయం గురువారం యూనివర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకుల్లో చర్చగా మారింది.

‘గృహజ్యోతి’కి ప్రజాపాలన దరఖాస్తు రశీదు..

- తప్పని సరి చేసిన విద్యుత్ పంపిణీ సంస్థలు

హన్మకొండ: విద్యుత్ పంపిణీ సంస్థలు.. గృహజ్యోతి పథకానికి ప్రజాపాలన దరఖాస్తు రశీదు అనుసంధానాన్ని తప్పనిసరి చేశాయి. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ వైద్య సాయం మొత్తం పెంపును అమలు చేస్తోంది. త్వరలో మరో రెండు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో గృహజ్యోతి పథకానికి అర్హులను గుర్తించే ప్రక్రియను రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థలు చేపట్టాయి. ఇందులో భాగంగా టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ సంస్థ గృహజ్యోతి లబ్ధిదారులను గుర్తించేందుకు స్పాట్ బిల్లు జారీ సమయంలోనే రేషన్, ఆధార్ కార్డు నంబర్లు, ఫోన్ నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేస్తున్నారు. దీంతో పాటు ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తు రశీదు నంబర్ వివరాలు కూడా అనుసంధానం చేయాలని క్షేత్ర స్థాయి ఉద్యోగులకు ఆదేశాలు అందాయి. దీంతో వినియోగదారులు ప్రజాపాలన రశీదు వెతికే పనిలో పడ్డారు. దరఖాస్తు సమయంలో తాము రశీదు తీసుకోలేదని కొందరు లబ్ధిదారులు, రశీదు తీసుకున్న వారిలో మరికొందరు నిర్లక్ష్యంగా పడేసినట్లు తెలిపారు. ఇప్పుడు రశీదు అందుబాటులో లేని వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజాపాలన దరఖాస్తు రశీదు చూపించాలి...



గృహజ్యోతి పథకం అమలు కోసం లబ్ధిదారుల గుర్తింపునకు వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. వినియోగదారులు ప్రజాపాలనలో అందించిన దరఖాస్తు రశీదుతో పాటు రేషన్, ఆధార్ కార్డుల వివరాలు విద్యుత్ సిబ్బందికి అందించాలి. ఒకవేళ ఏదేని కారణంతో విద్యుత్ సిబ్బంది వచ్చిన సమయంలో వినియోగదారులు లేని పక్షంలో సమీపంలోని విద్యుత్ ఏఈ కార్యాలయం, విద్యుత్ సహాయ గణాంకాధికారి కార్యాలయంలో కాని వివరాలు అందించాలి.

-మధుసూదన్, ఎస్ఈ, హనుమకొండ, వరంగల్

తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

- కుమ్మరికుంట్లలో ఘటన

దంతాలపల్లి : తాళాలు వేసిన రెండు ఇళ్లలో చోరీకి యత్నించిన సంఘటన మండలంలోని కుమ్మరికుంట్లలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనంప్రకారం..గ్రామానికి చెందిన షేక్ చాంద్‌పాషా ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఇంటికి తాళం వేసి మహబూబాబాద్‌లో తనకు మరో ఇల్లు ఉండగా కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి కుమ్మరికుంట్లలో షేక్ చాంద్‌పాషా ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు తెలిపారు. రాత్రి పాషా ఇంట్లో చప్పుడు కాగా ఇంటిపక్క వాళ్లు చాంద్‌పాషా ఇప్పుడు వచ్చాడేంటని దగ్గరికి వెళ్లి పిలవగా గమనించిన దుండగులు ద్విచక్రవాహనంపై పారిపోయారు. అదే గ్రామానికి చెందిన చామకూరి నర్సయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి మేడారం జాతరకు వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అదేరోజు రాత్రి ఇంట్లో చోరీకి ప్రయత్నించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. బాధితుడు నర్సయ్య తన ఇంట్లో రూ. 6 వేలు, 50 గ్రాముల వెండి గొలుసులు చోరీ జరిగినట్లు తెలిపారు. గురువారం క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



జనగామ: జనగామ సీఐగా ఎల్.రఘుపతిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న సీఐ రఘునాథపల్లికి బదిలీ కావడంతో.. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ సీఐగా పని చేస్తున్న ఆయన ఇక్కడకు వచ్చారు. కాగా, ఎస్సైలు సృజన్, అరుణ్, తిరుపతి, శ్వేత, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది నూతన సీఐని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జనగామ రూరల్ సీఐగా శ్రీనివాస్‌యాదవ్..



రఘునాథపల్లి: జనగామ రూరల్ సీఐగా ఎలబోయిన శ్రీనివాస్‌యాదవ్ గురువారం రఘునాథపల్లి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసే సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ ఐటీ సెల్‌కు బదిలీ కాగా జనగామలో పనిచేస్తున్న సీఐ శ్రీనివాస్‌యాదవ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌యాదవ్‌ను పోలీస్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ అల్వాల ఎల్లయ్య తెలిపారు. గురువారం కమిటీలను ఎన్నుకున్న అనంతరం మాట్లాడారు. అధ్యక్షులుగా చల్ల సంతోష్‌రెడ్డి, కుక్కల రాములు, ఉపాధ్యక్షులుగా ఎర్రోళ్ల శివ, సుందు రవి, జనరల్ సెక్రటరీగా ఎర్రోళ్ల నర్సింహులు, ఇంద్రయ్య, కార్యదర్శిగా వడాల మధు, యూత్ అధ్యక్షులు కాయిత గణేష్, గద్ద రాజు, కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, బండారి నరేష్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మసూద్, మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, జంగిటి విద్యానాథ్, పర్శరాములు, మధు, వీరారెడ్డి, బాలకిషన్‌గౌడ్, హరిబాబుగౌడ్, భాస్కర్‌రెడ్డి, వేణు వందన పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ కమిటీ..

కొడకండ్ల: బహుజన సమాజ్ పార్టీ నూతన కమిటీని గురువారం మండలకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పు గొండ కుమారస్వామి, ఉప అధ్యక్షుడిగా బంగారు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా అందె మధు, కోశాధికారిగా గుగులోత్ సాయిచరణ్, కార్యదర్శిగా దౌపాటి నరేష్, ప్రచార కార్యదర్శిగా ఎడెల్లి శరత్‌కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా మచ్చ యాకచరణ్‌లు ఎన్నికైనారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణ, అధ్యక్షుడు భాస్కర్, ప్రకాష్, ప్రసాద్, నవీన్, చరణ్ ఉన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

చిల్పూరు: చిల్పూరుగుట్ట నుంచి చిల్పూరుకు వెళ్లే రోడ్డులో వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు, చిల్పూరు మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట సమీపంలోని వాగుపై పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 80లక్షలతో చేపట్టిన హైలెవల్ కల్వర్టు నిర్మాణ పనులను సిబ్బందితో కలిసి ఆయన ప్రారంభించారు. నారగోని రాజు, పన్నీరు అశోక్, గొల్లపల్లి సారయ్య, పాము శంకర్, యాట లక్ష్మణ్, లింగమూర్తి పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల అరెస్ట్

కొడకండ్ల: హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి సమావేశానికి బయలుదేరే క్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. భూక్య శ్రీనునాయక్, వీరేష్, రాహుల్, నర్సింహ్మ, రాము, శ్రీనివాస్‌నాయక్ తదితరులను ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు.

రైలునుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



స్టేషన్‌ఘన్‌పూర్: సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వెళ్లే రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి(45) మృతిచెందిన సంఘటన మండలంలోని ఛాగల్లు–ఇప్పగూడెం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం తెల్లవారుజామున జరిగింది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్‌యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రమాదం దాదాపు ఉదయం 5 గంటల సమయంలో జరిగి ఉంటుందని, మృతుడు 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే జీఆర్‌పీ సిబ్బందిని 8712658603 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

● ఆర్డీఓ వాసం రామ్మూర్తి

జఫర్‌గఢ్: ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా చేపడుతున్న పనుల్లో అలసత్వం లేకుండా పనులు చేపట్టాలని, అలాగే ప్రజాపాలన వివరాల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ వాసం రామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని తిడుగు గ్రామంలో ప్రజాపాలన వివరాల సేకరణ కార్యక్రమాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా చెత్త లేకుండా పనులు చేపట్టాలన్నారు. తహసీల్దార్ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

చిల్పూరు : జీపీ కార్యదర్శులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్‌వాడీలు గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్యంతో పాటు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీఓ బంగారు వెంకటప్రసాద్ సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం కృష్ణాజీగూడెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని పల్లగుట్ట, కృష్ణాజీగూడెం పంచాయతీల ప్రత్యేకాధికారి, డీటీ విమలతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.



జఫర్‌గఢ్: తిడుగు గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

అధికారులు కొర్నేలియస్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, గోవర్ధన్, కార్యదర్శులు పిట్టల బాబు, పన్నీరు మధుసూదన్, శశిధర్‌రెడ్డి, హైమావతి ఉన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు అన్నారు. గురువారం వారు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. డ్రెయినేజీల శుభ్రం, వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగింపు, పైపులైన్ల లీకేజీలకు మరమ్మతు పనులు చేపట్టారు. వీధుల్లో సేకరించిన చెత్తను జీపీ ట్రాక్టర్లలో డంపింగ్ యార్డులకు తరలించారు.



చిల్పూరు: ఆరోగ్య ఉప కేంద్రం సందర్శనలో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్



బచ్చన్నపేట: పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి భరత్‌కిషోర్

తప్పులను త్వరగా సరిచేయాలి

● అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

రఘునాథపల్లి: అభయహస్తం దరఖాస్తుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం కొందరు తప్పుగా పొందుపర్చిన వివరాలను మొబైల్ యాప్ ద్వారా వీలైనంత త్వరగా సరిచేసి పంపించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సూచించారు. దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్ నంబర్ వివరాలు తప్పుగా రాసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో గ్యాస్ ఏజెన్సీల నుంచి వచ్చిన జాబితా ఆధారంగా వాటిని సరిచేయాల్సిన బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ గురువారం రఘునాథపల్లి, వెల్ది గ్రామాల్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. 'మహాలక్ష్మి' పథకానికి నమోదు చేసిన వివరాల్లో దొర్లిన తప్పులను సరిచేయడం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, రోడ్లు, మురుగునీటి కాల్వలను పరిశుభ్రం ఉంచాలని చెప్పారు. పిచ్చి మొక్కల తొలగించడంతోపాటు నిత్యం సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ యార్డులకు తరలించాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారులు రఘునందన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సాయిబాబా, కవిత పాల్గొన్నారు.



వెల్దిలో కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

సబ్సిడీ గ్యాస్ వివరాల నమోదు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను అందించడానికి వివరాల నమోదు ప్రక్రియను అధికారులు చేపట్టారు. గురువారం ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి గ్యాస్ కనెక్షన్ నంబర్లను రాసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో వివరాలు నింపని వారు ఇంటికి వచ్చి అధికారులు అందించాలని సూచించారు. లబ్ధిదారుల అందరి వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తామని కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ'

జనగామ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో కేంద్రంలో అధికారం చేపట్టబోతుందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు రావని ప్రధాని నరేంద్ర మోదీ జూటా మాటలు మాట్లాడగా, ప్రజలు 160 సీట్లు కట్టబెట్టారన్నారు. ప్రస్తుతం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోల కాంగ్రెస్‌కు 40 సీట్లు వచ్చే అవకావం లేదని పీఎం మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌కు 400 ఎంపీ సీట్లతో అధికారంలోకి తీసుకురాబోతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద ప్రజలకు రిజ్వేషన్లు దక్కకుండా మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలో పబ్లిక్ సెక్టార్లు పురుడు పోసుకుంటే, మోదీ సర్కార్ వాటిని బడాబాబులకు అమ్మకానికి పెడుతూ దేశాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. డిజిటల్ ఇండియా అని ప్రచారం చేసుకుంటున్న మోదీ ఆచరణలో శూన్యమన్నారు.

పద్మశ్రీ సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల: ఇటీవల కేంద్ర ప్రభుత్వం మండంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. మండలంలోని కోల్కొండలో చందన గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సమ్మయ్యను అభినందించారు. జిల్లా యువజన నాయకుడు వంగ అర్జున్ గౌడ్ గడ్డం రాజు, ముసిగోంపుల వేంకటేశ్వర్లు, సజ్జలు రంజిత్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి..



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల మాజీ సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డిలను గురువారం తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. జాతీయ స్థాయిలో నీటి సంవృద్ధిలో ఉత్తమ అవార్డు అందుకోవడం, జనవరి 26న రాష్ట్రపతి ఇంట్లో విందులో పాల్గొన్న సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరుట్ల లోక్‌మంత్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గండి ప్రభాకర్‌రెడ్డి, చెరుకు మహేందర్ రెడ్డి సన్మానించారు.

ఘనంగా సీఐకి వీడ్కోలు

జనగామ: జనగామ సీఐగా 22 నెలల పాటు పని చేసి రఘునాథపల్లి మండలానికి బదిలీపై వెళ్లిన సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌ను ఎస్సై, పోలీసులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. గురువారం ఆయన చాంబర్‌లో ఎస్సైలు సృజన్, అరుణ్, తిరుపతి, శ్వేత, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది శ్రీనివాస్‌కు గజమాల వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి, ఇన్ని రోజులపాటు కలిసి చేసిన విధి నిర్వహణను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన సీఐ మాట్లాడుతూ సుమారు రెండేళ్ల పాటు తనను ప్రోత్సహించిన ఉన్నతాధికారులు, సహచర అధికారులు, ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీ, క్రైం, ఇన్వెస్టిగేషన్ టీం ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్ది ఉత్సవాలు, సభలు, ప్రొటోకాల్ డ్యూటీస్‌ను సమష్టిగా పని చేసి సక్సెస్‌గా నిలిచామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఆయా పార్టీ నాయకులు శ్రీరాం హోటల్ రాములు, ఎండీ అజహరొద్దీన్, షకీల్ తదితరులు సీఐని సత్కరించారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్సై, పోలీసులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన చింత భిక్షపతి (46) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి గురువారం పార్టీ నాయకులతో ఇబ్రహీంపూర్ చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన దొరగొల్ల పాపయ్య (56) కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రోధిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పోకల శ్రీనివాస్, చింత నరేష్, ఎండీ గౌసిమియా, మేడిపెల్లి నరేష్, నోముల సత్తయ్య, మాటూరి పోశెట్టి, గ్యార ఐలయ్య, సంపత్, మహేష్, హరీష్ తదితరులు ఉన్నారు.

ఛాగల్లులో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన సత్తు రమేష్, లలితల కుమారుడు అఖిల్ (17) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అఖిల్ మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ సత్తు రవి, మాజీ ఎంపీటీసీ సామ్యేల్, నాయకులు రాఘవరెడ్డి, సంపత్‌రాజు, ప్రభాకర్, పొన్న రాజేష్, సమ్మయ్య, శ్రీకాంత్, యాకయ్య, అనీల్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెచ్చెట్టి చంద్రశేఖర్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక స్పృహ కలిగిన సంఘంగా యూటీఎఫ్ రాష్ట్రంలోనే అగ్రగ్రామిగా ఉందన్నారు. పీఆర్‌సీ నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని, 317 అమలుతో స్థానికత కోల్పోయిన వారిని సొంత జిల్లాలకు పంపించే విధంగా మార్పులు చేయాలని కోరారు. మండల అధ్యక్షుడిగా మడిశెట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కనుకయ్య, ఉపాధ్యక్షులుగా నర్సింహారావు, నర్సమ్మ, కోశాధికారి కనుకయ్య, కార్యదర్శులు రమేష్, సురేష్, నవీన్, సంజయ్, నాగేందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సద్గుణాచారి, కన్వీనర్ బాలకిషన్లను కల్చరల్ కమిటీ కన్వీనర్ గణేష్, స్వప్న, క్రీడల కమిటీ కన్వీనర్ వీర్యానాయక్, శేఖరయ్యలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తి, కనుకయ్య

రక్త పరీక్షలు తప్పనిసరి

చిల్పూరు: ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని, దీంతో అనారోగ్య సమస్యలుంటే తెలుస్తాయని హనుమకొండలోని మెడిహీల్ హాస్పిటల్ డాక్టర్ ఎండీ హనీఫ్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంగ్ల టీచర్ ఎండీ జుబేదా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని నోడల్ అధికారి, రాజవరం హెచ్‌ఎం గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాసి శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో హనీఫ్ హుస్సేన్ మాట్లాడారు. 105 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పర్వీన్, రమాదేవి, దుర్గ, స్వప్న, పావని, సుధారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనీఫ్ హుస్సేన్

కాపర్ వైర్ల చోరీకి యత్నం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని కాకర్ల బావి ఏరియాలోని వ్యవసాయబావుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి 20 మంది రైతుల మోటర్ కరెంట్ వైర్లను దొంగిలించే ప్రయత్నం చేశారు. స్టాటర్ల నుంచి మోటర్లకు వెళ్లే కాపర్‌వైర్ కోసం వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్తుండగా నాగారానికి చెందిన దండు కృష్ణ అనే రైతు బావి వద్ద మిర్చికి కాపాలా ఉండి గమనించి అలికిడి చేయడంతో వైర్లను గాదరి స్వామి పొలం వద్దకు వెళ్లే పానాది వద్ద వదిలేసి పారిపోయారు. సుమారు ఎనిమిది మంది వరకు దొంగలు వచ్చినట్లు సమాచారం. ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులు తిరిగి ఎవరి వైర్లను వారు తెచ్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

బంద్‌ను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సాగరంలో కార్మికులతో కలిసి ఆయన భారత్ బంద్ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, సమ్మయ్య, రమేష్, సత్తయ్య, గోపాల్, కుమార్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

జయగోపాల్ మృతి తీరనిలోటు

పాలకుర్తి: మానవ హక్కుల సాధన కోసం తన జీవిత కాలం శ్రమించిన మానవ హక్కుల సాధన ఉద్యమ కమిటీ కార్యకర్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయగోపాల్ మృతి తీరనిలోటని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు గుమ్మడి రాజుల సాంబయ్య అన్నారు. గురువారం సాంబయ్య పాలకుర్తిలో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల సాధన కోసం తీవ్రంగా ప్రయత్నించిన నాయకుడు జయగోపాల్ మృతి బాధాకరమన్నారు. ఆయన ఆయశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న దీక్షలు

జనగామ రూరల్: గతేడాది వడగళ్ల వానలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతు యాసారపు కర్నాకర్ చేపడుతున్న దీక్ష గురువారం 4వ రోజుకు చేరుకుంది. దీక్షకు ఎమ్మార్పీఎస్ నాయకుడు గువ్వల రవి మద్దతు తెలిపి దీక్షలను ప్రారంభించారు. సత్యనారాయణ, జలెందర్, ఏలేందర్ పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ డే

జనగామ రూరల్: పట్టణంలోని శ్రీసాయి ఒకేషనల్ కళాశాల విద్యార్థులు గురువారం ఓం సాయి గార్డెన్‌లో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షలు మెరుగ్గా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కాకతీయ డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఉపేందర్, కుటిగంటి రమేష్, పర్శరాములు, శశికుమార్, సుహాసిని, సువర్ణ, సుస్మిత పాల్గొన్నారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

జఫర్‌గఢ్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్ డిమాండ్ చేశారు. మండలంలోని రఘునాథ్‌పల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పి గద్దెదించారన్నారు. ఈ ఓటమిని తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ, ప్రధాని నరేంద్రమోదీ ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ చేపట్టిన గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాంనూర్ గ్రామంలో గురువారం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, కిషోర్, భిక్షపతి పాల్గొన్నారు.

నేడు కెనాల్ పనుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ రిజర్వాయర్ కింద కుడి ప్రధాన కాల్వ పనులను శుక్రవారం పరిశీలించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఘన్‌పూర్ మండలంలోని తానేదార్‌పల్లి, బోయినిగూడెం, కోమటిగూడెం, రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి, శ్రీమన్నారాయణపురం, నవాబుపేట రిజర్వాయర్ వరకు ప్రధాన కాల్వలు, ఉపకాలువలను పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..!

● పట్టించుకోని అధికారులు

లింగాలఘణపురం: చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా విద్యుత్ అధికారుల్లో కదికలికలేదు. రైతుల ప్రాణాలు పోతేగాని అప్పుడైనా స్పందిస్తారో లేదో తెలియదంటూ మండలంలోని పటేల్‌గూడేనికి చెందిన రైతు పొన్నాల బుచ్చయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకున్న 30గుంటల వ్యవసాయ భూమిలో ఎనిమిది విద్యుత్ స్తంభాలతోపాటు 11/కేవీ లైన్లు రెండు, ఎల్‌టీ లైన్లు రెండు ఏర్పాటు చేసి పొలమంతా కరెంట్ తీగలతో చుట్టేయడం ఒక ఎత్తైతే ఆ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయని తెలిపాడు. వీటికి తోడు విద్యుత్ స్తంభం విరిగి ఎప్పుడు వైర్లు మీదపడుతాయోనని భయంభయంగా గడుపుతున్నారు. రెండేళ్ల క్రితం స్తంభాలు తెచ్చి పొలంలో పడవేశారే గాని వాటిని సరిచేయలేదు. ఇదేందంటూ రైతు కుమారుడు కరుణాకర్ అధికారులను ప్రశ్నిస్తే లైన్ షిఫ్టింగ్ కోసం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యే మార్గం ఉన్నప్పటికీ దానికి నిబంధనలు, రూల్స్ అడ్డు వస్తున్నాయని అధికారులు దాటవేయడం విడ్డూరంగా ఉంది.



చేతికి అందే ఎత్తులో ఉన్న వైర్లు



విరిగిన స్తంభానికి ప్రమాదకరంగా ఉన్న వైర్లు

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం..



మా పొలంలో నుంచే ఏడెనిమిది స్తంభాలు వేశారు. తీగలు కిందికి ఉన్నాయి. మార్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఏమైనా అంటే షిఫ్టింగ్ కోసం డబ్బులు కట్టండి అంటూ వేల రూపాయాలు డిమాండ్ చేస్తున్నారు. – పొన్నాల బుచ్చయ్య, రైతు, పటేల్‌గూడెం

మిడిల్ పోల్స్ సరిచేస్తాం..

మిడిల్ పోల్స్ వేసి తీగలు పైకి ఎత్తిస్తాం. ఇటీవలే ఏడీ గారు వచ్చి పరిశీలించారు. త్వరలోనే పనులు చేయిస్తాం. లైన్ షిఫ్టింగ్ కోసం మాత్రం డీడీ తీయాల్సి ఉంటుంది. ఆ విషయం రైతుకు కూడా చెప్పాం. – శంకరయ్య, ఏఈ, ట్రాన్స్‌కో